# రేపటి వెలుగు

గణపతి బాత్‌రూమ్‌లో హమ్మింగ్ చేస్తున్నాడు.

" మన్ తడప్ తడప్ హరి దర్శన్ కో ఆజ్ " అని రాగం తీసి అదే పాదాన్ని మళ్లీ మళ్లీ పాడుకుంటూ... మధ్య మధ్యలో " మన్ తడప్ తుమ్ దర్శన్‌కో ఆజ్" అని మార్చి మార్చి ఆనందిస్తున్నాడు. అతనికి తెలుసు... తాను పాడే పాటలో అపశబ్దాలు ఎక్కువే అని.

అపశబ్దాలు కలిపి పాడితేనే అసలైన ఆనందం మరి!

స్నానం అయింది. డ్రస్ చేసుకుని హాల్లోకొచ్చి కూర్చున్నాడు గణపతి.

గేటు చప్పుడైంది. అటుకేసి చూశాడు.

క్షణాల్లో ఆవ్యక్తి ఇంట్లోకి వచ్చేశాడు.

"రామ్మూర్తి!"... ఆశ్చర్యపోయాడు గణపతి. పైకే అనేశాడు.

రామ్మూర్తి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. హాలంతా కలయచూశాడు. సరాసరి తాను చెప్పదల్చుకున్న విషయంలోకి దూకేశాడు. గణపతిని వుద్దేశించి చెప్పడం మొదలెట్టాడు.

"ఆ మనిషి చాలా రణపెంకె సార్. ఏదో చిన్నతనం లెమ్మని అన్ని విషయాల్లోనూ నేనే సరి పెట్టుకుపోయేవాణ్ణి. ఆఫీసునుంచీ వోగంట లేటుగా వచ్చిన పాపానికి పెద్ద యుద్ధం చేసేది. నిజం చెప్తున్నాను సార్. ఒకరోజు వండే వండే అన్నాన్ని కుంపట్లో పోసేసింది. చిన్న విషయానికి కూడా ఆమె సతాయింపు ఆ స్థాయిలో ఉండేది. నేను వాటన్నిటికీ కూడా బాధపడలేదు... మాస్టారూ. ఆమె పొగరుబోతుతనం ఎంతదూరం వెళ్ళిందంటే చీటికీ మాటికీ నాతో దెబ్బలాడి పుట్టింటికి పోయేది. నేనెళ్లి మొత్తుకొవడం. అతి కష్టంమీద తిరిగి వచ్చేది. కానీ ఏం ప్రయోజనం? మానసికంగా, శారీరకంగా ఎందుకూ నాకు ఉపయోగపడేది కాదు."

అతను తలవంచుకొని ఒక్కక్షణం ఆగేడు. రామ్మూర్తి మాటలకి గణపతి ఏమీ విస్తుపోలేదు. అతన్ని తేరిపార జూసేడు. అడ్డదిడ్డంగా పెరిగిన గెడ్డం, నిర్లక్ష్యంగా ఫాన్ గాలికి లేస్తున్న తైల సంస్కారం లేని జుట్టు, మాసి ముడుతలు పడ్డ బట్టలు, మనిషిలోని కరుడు గట్టిన దౌష్ట్యం- కళ్లజీరల్లో కనిపిస్తోంది. అతని రూపాన్ని చూస్తుంటే ఉమ్మెత్తకాయ స్ఫురించేది - గణపతికి.

రామ్మూర్తి మళ్లీ మొదలెట్టాడు, "నాకు ఆమెని చూస్తుంటే రాక్షసిని చూస్తున్నట్టే వుండేది. రాత్రంతా ఓ మూల కూలబడి ఉండేవాణ్ణి. గుండె మండుతూ ఉండేది. కళ్లు వాచిపోయేవి. ఏం చేయాలో అర్థం అయ్యేది కాదు.

అతను ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచి కుర్చీలోకి రెండు కాళ్ళని చేర్చి ముడుచుక్కూర్చున్నాడు.

గణపతి కళ్ళు రామ్మూర్తి పాదాల్ని చూసినై. నెర్రెలు విచ్చిన నల్లరేగడి గద్దలు తలపుకొచ్చినై - గణపతికి.

"ఛీ... ఛీ.... నిజంగా ఆడది కాదది - రాక్షసి!!

తులసి కాఫీ కప్పులతో వంట ఇంట్లోనుంచి హాల్లోకి వచ్చింది

రామ్మూర్తి షాక్ తిన్నాడు. మందు దట్టించిన ఫిరంగి తనవైపు గురిపెట్టబడినట్లు అనిపించింది అతనికి.

"నీ గురించే చెప్తున్నాడు తులసీ ఈయన" తులసిని ఉద్దేశించి అన్నాడు, గణపతి.

నడుస్తున్న జాజి తీగెలా పక్కకి నడిచి - గణపతికి కాఫీ కప్పునందించింది తులసి. రెండో కప్పుని తన చేతిలో పట్టుకొని కుర్చీలో కూర్చుంది. కాఫీ సిప్ చేస్తూ... "తీసుకోండి" అన్నట్టు గణపతికేసి చూసింది.

అతనూ కాఫీ తాగడం మొదలెట్టాడు.

రామ్మూర్తి బిక్క చచ్చిపోయాడు. అతను ఊహించని మలుపు ఇది. తులసీ గణపతీ గురించి ఎవరో చెప్పగా విన్నాడేకానీ, తులసి గణపతి ఇంట్లోనే ఉంటుందన్న వాస్తవం అతనికీ తెలియదు. అసహనంగా కుర్చీలో మసిలేడు. రెండు కాళ్ళు కిందకి పెట్టేడు. అతని పెదవులు అదరసాగినై. కోపం ముంచుకొచ్చింది. లేచాడు. అటూ ఇటూ తిరుగుతూ మధ్య మధ్య తులసివైపు మిర్రి మిర్రి చూపులు చూడసాగేడు. గోదవారగా నడిచి కాళ్లతో నేలను తన్నేడు. గోడమీద చూపుడు వేలుతో ఏవో పిచ్చి అక్షరాల్ని రాసి వెనక్కి తిరిగేడు.

గణపతీ తులసీ కాఫీ ముగించారు.

గణపతి కుర్చీలోంచి లేచి బయటకు వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు. పోతూ పోతూ వెనక్కి తిరిగి, తులసి నుద్దేశించి ... "తులసీ, ఈయన పేరు రామ్మూర్తి. వర్మా అండ్ కంపెనీలో డిస్మిస్డ్ ఎంప్లాయీ. నీతో మాట్లాడాలనే వచ్చారనుకుంటా" అని చకచకా కదిలి పోయాడు.

రామ్మూర్తి అహం దెబ్బతింది. గుండెలో మెత్తని కత్తి దించినట్లయింది.

ఇప్పటికే తులసి ప్రవర్తనకి అతని కడుపు రగిలి పోతోంది.

గణపతి వెళ్లగానే కుర్చీలోంచి లేచి లోపలికి వెళ్లిపోయింది తులసి.

ఆమె వెనగ్గా తానూ లోపలికి వెళ్లబోయాడు రామ్మూర్తి. కానీ ఇంతలో వసారా గదిలోంచి సన్నని దగ్గు వినిపించింది. ఆగిపోయి వెనక్కి చూశాడు రామ్మూర్తి.

హాల్లో పచార్లు చేస్తూ ఇందాకటి గోడవారగా వచ్చేడు. గోడమీద మళ్లీ ఏవేవో గీతలు గీశాడు. పళ్ళు కొరుక్కున్నాడు.

"నాకు ఇంకేం అఖ్ఖర్లేదమ్మా. నువ్వు వెళ్లి నీ పని చూసుకో" అని గదిలోనుంచి మాటలు వినిపించినై. ఆ వెనగ్గా తులసి హాల్లోకి వచ్చింది.

కాఫీ కప్పులు తీసుకొని వెళ్లబోతుంటే ,గొంతు పెకల్చుకొని మాట్లాడేడు రామ్మూర్తి. " కాస్త ఆగు తులసీ. నా మాట విను...."

తులసి అతని వైపు నిరాసక్తతతో చూసింది. అసహనంగా నిలబడింది.

"నాకు తెలుసు. నేనిప్పుడేం చెప్పినా నువ్వు నమ్మవు. నిజం చెప్పాలంటే నువ్ వచ్చేసినప్పటినుంచీ - నడుస్తున్న శవంలా తిరుగుతున్నాను నేను. నన్ను నరకంలో పారేసి వచ్చేశావు నువ్వు." అని ఓ క్షణం ఆగి " నాకు ఉద్యోగం కూడా పోయింది...." అంటూ తల వంచుకున్నాడు.

"మన ఒక్కరాష్ట్రంలోనే కొన్ని లక్షల మంది నిరుద్యోగులున్నార్ట..."

"అంటే నేనూ వాళ్లల్లో ఒక్కణ్ణంటావ్. హూ" అని ఓ క్షణం ఆగి అన్నాడు. "నన్ను క్షమించు తులసీ. జరిగిందంతా మరచిపో"

పేలవంగా నవ్వింది తులసి. చేతిలోని కప్పును టీ పాయ్ మీద పెడ్తూ అడిగింది, "మరిచిపోయి ఏంచేయాలి?"

"నాతో వచ్చేయ్, మన ఇంటికి పోదాం..."

"మన ఇల్లు.... హు...!"

" అవును - నువ్వు వచ్చి నన్నీ పరిస్థితుల్నుంచీ రక్షించకపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం."

"అదీ అంత తేలిక కాదు. మీరు నాకలాంటి స్థితి కల్పించినా చూశారా... ఆత్మహత్య చేసుకోవడం నావల్ల కాలేదు."

"చచ్చిన పాముని ఇంకా చంపబోకు తులసీ... నన్ను క్షమించు..." ఒక్కడుగు ముందుకువేసి ఆమె చేతులు పట్టుకున్నాడు రామ్మూర్తి.

అతని చేతుల్ని విదిలించేసింది తులసి. ఆమె కళ్లు అసహ్యంతో నిండి పోయాయి.

అవేమీ గమనించనట్లు, " ఈ కష్టకాలంలో నాకు నువ్ తప్ప మరెవరున్నారు తులసీ..."

రామ్మూర్తి ఏడ్చేశాడు.

తులసి చిరాకు పడింది. " అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు", కప్పులు చేతుల్లోకి తీసుకొని ఓ అడుగు పక్కకు వేసి కదిలింది.

"కాదు తులసీ. ఈ ఒక్కసారికీ నామాట నమ్ము. నన్ను నువ్వే ఆదుకోవాలి."

"అదే అంటున్నాను నేనుకూడా. మిమ్మల్ని ఆదుకోవడానికి మాత్రమే నేను మీకు కావాలి అంతేగా? " కరకుగా అడిగింది. 'ఆదుకోవడానికి' అనే మాటని వత్తి పలికింది.

"అంటే?" అని అర్థం కానట్లు ఆమె వైపు చూసేదు రామ్మూర్తి.

"మీకు అంత తేలిగ్గా అర్థం కాదులెండి. అయినా- అనవసరపు మాటలెందుకు? మీరు వెళ్ళొచ్చు".

"ఇదే నీ నిర్ణయమా?"

"అవును. అయినా మీకు తెలుసుగా ... నేను రణపెంకిననీ, పొగరుబోతుననీ, ఇందాక కూడా గణపతికి చెప్పావు. అందుకు నేను అనుభవించిన క్షోభనంతా మీరు అనుభవించినట్లు ఇతరులకి చెప్తున్నా వింటూ ఊరుకున్నాను".

ఒక్కక్షణం ఆగి ఉద్వేగంతో చెప్పుకుపోసాగింది. "అంతేకాదు, నేను నిజంగా ఆడదాన్ని కాదు. మీరు నా దేహంమీద చేసిన చిత్రహింసలన్నీ సహించి మిమ్మల్ని పతిదేవుడిగా భావించాను."

"ఒక్క మాట నేను రాక్షసిని కూడా, అవును నేను రాక్షసినే... నేనున్న గదిలోకి మరో మొగాణ్ణి పంపి తలుపు గొళ్ళెం పెట్టిన నిన్ను... ప్రాణాల్తో వదిలిపెట్టి వచ్చేశాను. అవును నేను రాక్షసినే. రాక్షసినే." అరిచేసింది, తులసి.

సాచి చెంపపెట్టు పెట్టినట్లయింది రామ్మూర్తికి. స్థాణువులా నిలబడిపోయాడు.

ఠక్కున రామ్మూర్తిని గుమ్మంనుంచీ బయటకు నెట్టి, విసురుగా తలుపు వేసి, లోపలికి పోయింది తులసి.

రామ్మూర్తి మెదడులో సినిమా రీళ్లు తిరుగుతున్నై.

రోడ్డు వారగా బంకు దగ్గర నిలబడిన గణపతి... సన్నగా ఈల వేసుకొని, కూనిరాగాన్ని హమ్మింగ్ చేస్తూ కదిలిపోతున్నాడు! అతని చూపు ... న్యాయం, చట్టం చూపుతున్న రేపటి వెలుగు వైపు!!!

***

(ఆదివారం ఉదయం)

